ఆన్‌లైన్‌లోనే హెచ్‌టీ సర్వీసు సేవలు

- సత్వర సేవలకు ఆన్‌లైన్ పోర్టల్
- ప్రారంభించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): హైటెన్షన్ లైన్ల (హెచ్‌టీ) తరలింపు సేవలను సులభతరం చేయడంలో భాగంగా విద్యుత్తుశాఖ ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా ఇంటి నుంచే దరఖాస్తు చేసుకునే సౌలభ్యాన్ని కల్పించింది. ఇందుకు సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్‌ను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మింట్ కంపౌండ్‌లోని టీఎస్ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో బుధవారం ప్రారంభించారు. 132, 220, 400 కేవీ వంటి హెచ్‌టీ లైన్ల కొత్త సర్వీసులను పొందడం, ఇప్పటికే ఉన్న సర్వీసులను మరోచోటుకు మార్చడం కోసం ఇక నుంచి వినియోగదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా దరఖాస్తులను అధికారుల నిర్ణీత సమయంలో పరిశీలించి సత్వర సేవలందించేలా ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్టు భట్టి తెలిపారు. వినియోగదారులు www.tstransco.in, www.tssouthernpower.com, www.tsnpdcl.in వెబ్‌సైట్లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సయ్యద్ ముర్తుజా అలీ రిజ్వీ, టీఎస్ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే కోనప్ప

కుమ్రంభీం ఆసిఫాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ నాయకుడు, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. నియోజకవర్గ సమస్యలపై చర్చించినట్టు తెలిసింది. కాగా ఆయన త్వరలో కాంగ్రెస్‌లో చేరుతారన్న ప్రచారం జరుగుతున్నది.

లోన లొంగిపోయి.. బయట గాయి..గాయి

> మొదటిపేజీ తరువాయి...

మార్పుకు కారణం సుస్పష్టం. బీజేపీతో రేవంత్ బంధం బట్టబయలై, ఆ అక్రమ సంబంధాన్ని బీఆర్ఎస్ ఎండగట్టడంతో 'గుమ్మడికాయల దొంగ అంటే.. భుజాలు తడుముకున్నట్టు' ఉలికిపడి పాలమూరు సభలో గాయి గాయి చేశారు. బీజేపీపై ఉత్తుత్తి ఆగ్రహాన్ని ప్రదర్శించారు. మోదీతో తన సఖ్యతపై ఇంటాబయటా విమర్శలు వస్తున్న వేళ.. వాటి నుంచి బయటపడేందుకు విఫలయత్నం చేశారు. పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరించేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ పాలమూరులో నిర్వహించిన ప్రజాదీవన బహిరంగ సభ పక్కదారి పట్టింది. ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి రాసుకుపూసుకు తిరగడంపై ఇంటా (కాంగ్రెస్), బయట (ప్రజల్లో) విమర్శలు వెల్లువెత్తడంతో దాని నుంచి బయటపడేందుకు ఈ సభను వేదికగా మార్చుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు ఎందుకు వేయాలో ప్రజలకు వివరించకుండా, మోదీని తాను ఎందుకు కలిశానో వివరణ ఇవ్వడానికే రేవంత్‌రెడ్డి ప్రయత్నించారు. రాష్ట్రానికి ప్రధానమంత్రి వచ్చినప్పుడు మర్యాదపూర్వకంగా కలిస్తే తప్పేమిటని తనను తాను సమర్థించుకోవడానికే ఎక్కువగా ప్రయాసపడ్డారు. రాష్ట్రాభివృద్ధికి, ప్రాజెక్టులకు నిధులు అడిగాం.. ఇవ్వనిపక్షంలో చాకిరేవు పెడుతానని, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు తిరిగి కేంద్రం వైఖరిని ఎండగడుతానంటూ మొక్కుబడిగా ఒక హెచ్చరిక చేసి అటు పార్టీ నాయకత్వాన్ని, ఇటు ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు.

కాంగ్రెస్ పెద్దల కన్నెరతోనే..

ప్రధాని మోదీని పెద్దన్నగా సంభోదించడం, మీ సహాయ సహకారాలు, మీ ఆశీస్సులు మాకు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా సాగిలబడినట్టుగా వ్యవహరించడం విమర్శలకు దారితీసింది. ఇది కాంగ్రెస్ పెద్దలకు రుచించకపోగా, వివరణ కూడా అడిగినట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం. మరోవైపు రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కేంద్రంతో, ముఖ్యంగా ప్రధాని మోదీతో నెరుపుతున్న బంధాన్ని ప్రతిపక్ష బీఆర్ఎస్ ప్రజల ముందుంచింది. దీనిని నుంచి బయటపడటానికి ప్రజాదీవన సభా వేదికపై రేవంత్‌రెడ్డి ప్రయాసపడక తప్పలేదు. మరోవైపు, తమ ప్రభుత్వాన్ని కూల్చుతారంటూ అంటూ పరోక్షంగా బీఆర్ఎస్‌ను టార్గెట్ చేస్తూ ప్రజల నుంచి సానుభూతి పొందే ప్రయత్నం చేశారు. వాస్తవానికి 'ప్రజలకు మాపై కోపం వచ్చిందో.. లేక మార్పు కోరుకున్నారేమో.. కారణం ఏదైతేనేమి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.. ఐదేండ్లు పాలించుకోమనండి.. మాకు అభ్యంతరం లేదు.. బాధ్యతాయుతమైన ప్రతిపక్షపాత్ర పోషిస్తాం' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కుండబద్దలు కొట్టినట్టు విస్పష్టంగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ తమ ప్రభుత్వాన్ని కూల్చడానికి ప్రయత్నిస్తున్నారంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఈ సభలో పెడబొబ్బలు పెట్టడం వెనుక పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి, ప్రజల్లో సానుభూతి పొందే వ్యూహం దాగిఉన్నది. ఐదేండ్లు పాలించుకోమనండని ప్రధాన ప్రతిపక్షమే అన్నాక ఇక ప్రభుత్వం ఏవిధంగా కూలుతుందో కనీస లాజిక్కూ లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరమని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలితే గిలితే అది రేవంత్‌రెడ్డి నేతృత్వంలోనైనా, లేదా మరెవ్వరైనా మహారాష్ట్ర మాదిరిగా ఏక్‌నాథ్‌షిండేలా కేంద్రంలోని బీజేపీతో చేతులు కలిపితే తప్ప సాధ్యం కాదన్నది రాజకీయ పరిజ్ఞానం ఉన్నవారు ఎవరైనా చెప్తారు. కానీ ఇందిరమ్మ రాజ్యాన్ని ఆరు నెలలు అయినా ఉండనీయరా? తమ ప్రభుత్వాన్ని కూల్చుతారంటూ అంటూ పరోక్షంగా ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి బురదజల్లే ప్రయత్నం చేశారు.

పదేండ్లు కాంగ్రెస్‌దే అధికారం

రాష్ట్రంలో మరో పదేండ్లపాటు కాంగ్రెస్సే అధికారంలో కొనసాగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన తమ ప్రభుత్వం జోలికి వస్తే అంతు చూస్తామని హెచ్చరించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా, మోదీ ప్రధానిగా పదేండ్లు ఉండొచ్చు కానీ, ఇందిరమ్మ రాజ్యం, పేదోళ్ల ప్రభుత్వాన్ని ఆరు నెలలు కూడా ఉండనీయరట అని ధ్వజమెత్తారు. 'మా ప్రభుత్వాన్ని టచ్ చూసి చూడండి. పాలమూరు బిడ్డలు మానవబాంబులై... ఎవరైనా మిగులుతరేమో చూస్తా.. ఒక్కొక్కడిని పండబెట్టి తొక్కి పేగులు తీసి మెడలో వేసి ఊరేగుతా..' అంటూ తన స్థాయిని మరచి, అసభ్యకర పదాలు వాడుతూ తన అసహనం, ఫ్రస్ట్రేషన్ వెళ్లగక్కారు. నల్లమల నుంచి వచ్చిన తాను ఒక సామాన్య కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి, అడ్డొచ్చిన వారిని తొక్కుకుంటూ సీఎం స్థాయికి వచ్చానని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని 14 ఎంపీ సీట్లలో గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. రాహుల్‌గాంధీని ప్రధాని సీట్లో కూర్చోబెట్టడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడాలని పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మన్నె జీవన్‌రెడ్డి పేరును సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ సభలో మంత్రులు దామోదర రాజనరసింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎలివేటెడ్ కారిడార్‌కు నేడు శంకుస్థాపన

- రూ. 2232 కోట్లతో నిర్మాణం
- హైదరాబాద్-రామగుండం మార్గంలో కారిడార్
- బీఆర్ఎస్ హయాంలోనే డీపీఆర్‌లు సిద్ధం

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నుంచి రామగుండం వెళ్లే రాజీవ్ రహదారిపై రూ. 2232 కోట్లతో నిర్మించే భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అల్వాల్‌లో శంకుస్థాపన చేయనున్నారు. పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా కింద రోడ్డు మార్గం, పైన మెట్రోరైలు వెళ్లేలా రాజీవ్ రహదారితోపాటు నాగపూర్ వెళ్లే మార్గంలో కూడా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం సమగ్ర ప్రాజెక్టు నివేదికలను సిద్ధం చేసింది. అయితే, కంటోన్మెంట్‌లో రక్షణ శాఖకు చెందిన భూములను కేంద్రం ఇవ్వకపోవడంతో ఈ కారిడార్ల నిర్మాణం పెండింగ్‌లో పడింది. తాజాగా, కేంద్రం రక్షణ శాఖ భూములు ఇచ్చేందుకు ఒప్పుకోవడంతో కారిడార్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతున్నది. ఇందులో భాగంగా మొదలు రాజీవ్ రహదారిపై ప్యారడైజ్ నుంచి హకీంపేట్ వరకు సుమారు 19 కిలోమీటర్ల పొడవున కారిడార్ నిర్మాణానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం గతంలోని ప్రణాళికలనే అమలు చేస్తుందా.. లేక మారుస్తారా అనేది స్పష్టత లేదు. కారిడార్‌కు సంబంధించి డీపీఆర్‌ల రూపకల్పన బాధ్యతను ప్రభుత్వం హెచ్‌ఎండీఏకు అప్పగించింది.

మూసీ నిరాశ్రయులకు డబుల్ బెడ్రూం ఇండ్లు

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు వల్ల నిరాశ్రయులయ్యే నిరుపేదలకు గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అసంపూర్తిగా ఉన్న గృహాలను పూర్తిచేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 400 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించడంతో త్వరలోనే పనులు చేపట్టనున్నారు. నగరం మధ్య నుంచి దాదాపు 50 కిలోమీటర్ల మేర మూసీనది ప్రవహిస్తున్నది. దానికి ఇరువైపులా 50 వేలకుపైగా కుటుంబాలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నాయి. రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు కోసం వీరందరినీ అక్కడి నుంచి ఖాళీ చేయించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు పంపిణీ చేయకుండా మిగిలి ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లను నిరాశ్రయులకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేసీఆర్ ప్రభుత్వం రూ. 12,272.61కోట్లు ఖర్చుచేసి 1,94,859 డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం చేపట్టింది. అందులో 1,48,521 గృహాలు పూర్తికాగా, మిగిలిన 46,338 ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిలో పదివేలకుపైగా ఇండ్లు తుదిదశలో ఉన్నాయి. పూర్తయిన ఇండ్లలో సుమారు 70వేలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

బరాజ్‌ల సమగ్ర సమాచారమివ్వండి

- ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ ఆదేశం
- రాష్ట్ర ఇరిగేషన్ అధికారులతో భేటీ
- అనంతరం మేడిగడ్డకు పయనం
- రెండ్రోజులపాటు బరాజ్‌ల పరిశీలన
- 9న జలసౌధలో మరోసారి సమావేశం

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందజేయాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించింది. మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుకు కారణాల అన్వేషణలో అన్నివిధాలుగా సహకరించాలని కోరింది. మేడిగడ్డతోపాటు, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల్లోని సమస్యలను గుర్తించి పునరుద్ధరణ చర్యలకు సిఫారసులు చేసేందుకు ఆరుగురు సభ్యులతో ఎన్‌డీఎస్‌ఏ నియమించిన నిపుణుల కమిటీ బుధవారం రాష్ట్రానికి విచ్చేసింది. ఆ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్, సభ్యులు యూసీ విద్యార్థి, ఆర్ పాటిల్, శివకుమార్ శర్మ, రాహుల్‌కుమార్ సింగ్, మెంబర్ సెక్రటరీ అమితాబ్ మీనా జలసౌధలో రాష్ట్ర ఇరిగేషన్ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఈఎన్సీ అనిల్‌కుమార్, ఈఎన్సీ (ఓఅండ్ఎం) నాగేందర్‌రావు తోపాటు ఆయా ప్రాజెక్టుల అధికారులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. 3 బరాజ్‌లకు సంబంధించిన ప్లానింగ్, డిజైన్లు, నిర్మాణం, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ తదితర అన్ని విభాగాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బరాజ్‌ల జియోఫిజికల్ క్రాస్ సెక్షనల్ రిపోర్టుతోపాటు థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ రిపోర్టులను సమర్పించాలని ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ రాష్ట్ర అధికారులకు సూచించింది. జియోఫిజికల్ రిపోర్టును ఇప్పటికే అందజేశామని రాష్ట్ర అధికారులు తెలుపగా.. మరింత సమగ్రంగా అందజేయాలని కమిటీ ఆదేశించారు. థర్డ్ పార్టీ క్వాలిటీ చెకింగ్ అనేది గతంలో ఈపీసీ విధానంలో ఉండేదని, దానిపై అనేక ఆరోపణలు రావడంతో తెలంగాణ ఏర్పాటు తర్వాత తొలగించామని రాష్ట్ర అధికారులు వివరించారు. ఎన్‌డీఎస్‌ఏ కోరిన ప్రతి రిపోర్టును సమగ్ర వివరాలతో అందజేస్తామని తెలిపారు. అనంతరం ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ ఈఎన్సీ (ఓఅండ్ఎం) నాగేందర్‌రావు నేతృత్వంలో బరాజ్‌ల పరిశీలనకు బయలుదేరి వెళ్లింది. గురువారం ఉదయం మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లను.. శుక్రవారం సుందిళ్ల బరాజ్‌ను సందర్శించి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నది. అనంతరం 9న హైదరాబాద్‌కు తిరిగివచ్చి జలసౌధలో రాష్ట్ర ఇరిగేషన్ ఉన్నతాధికారులతోపాటు ఆయా బరాజ్‌ల డిజైన్లు, ప్రణాళికల రూపకల్పనలో, నిర్మాణంలో భాగస్వాములైన అన్నివిభాగాల కీలక అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ కానున్నది.

నిపుణుల కమిటీ సిఫారసుల ఆధారంగానే మేడిగడ్డ బరాజ్ పునరుద్ధరణ

- 'కాళేశ్వరం'పై ప్రాథమిక నివేదిక ఇవ్వండి
- ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీకి మంత్రి ఉత్తమ్ విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ సమర్పించే ప్రాథమిక నివేదిక ఆధారంగానే మేడిగడ్డ బరాజ్ పునరుద్ధరణకు చర్యలు చేపడతామని రాష్ట్ర సాగునీటి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సాధ్యమైనంత త్వరగా ప్రాథమిక నివేదిక ఇవ్వాలని, వానకాలంలోగా మేడిగడ్డ బరాజ్‌కు చేపట్టాల్సిన తాత్కాలిక మరమ్మతులను సిఫారసు చేయాలని నిపుణుల కమిటీకి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన జలసౌధలో కమిటీతో ప్రత్యేక భేటీ అనంతరం మీడియాతో మాట్లాడారు. బరాజ్ కుంగుబాటుకు కారణాలను అన్వేషించాలని, అవసరమైతే అత్యాధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని చెప్పామని తెలిపారు. ఆ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు. ఎన్‌డీఎస్‌ఏ కమిటీకి అన్ని విధాలా సహకరించాలని, వారు కోరిన పత్రాలన్నీ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఏవైనా డాక్యుమెంట్లను దాచిపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మేడిగడ్డ బరాజ్‌ను వర్షాకాలానికి ముందే అందుబాటులోకి తీసుకువస్తే బావుంటుందన్నారు. నిర్మాణ లోపాలు తేలితే నిర్మాణ సంస్థ, అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

బీజేపీ ఎందుకు విచారణ చేయలేదు?

ఇటీవల ఆదిలాబాద్ సభలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఉత్తమ్ ఘాటుగా స్పందించారు. కాళేశ్వరంలో అవినీతి జరిగితే బీజేపీ ఎందుకు విచారణ చేయించలేదని ప్రశ్నించారు. విభజన హామీలను నెరవేర్చకపోగా 7 మండలాలను ఏపీలో విలీనం చేసిందని, సీలేరు పవర్ ప్లాంట్‌ను లాగేసుకున్నదని, రూ.50 లక్షల కోట్ల విలువైన ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేసిందని నిప్పులు చెరిగారు.

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జనరల్ సెక్రటరీగా ప్రదీప్‌సింగ్

- సహాయ కార్యదర్శులుగా రంగారావు, సుభాష్‌దేవ్

ఖమ్మం, మార్చి 6 : సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జాతీయ కార్యదర్శిగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రదీప్ సింగ్ ఠాగూర్, సంయుక్త కార్యదర్శులుగా పోటు రంగారావు (తెలంగాణ), సుభాష్‌దేవ్ (త్రిపుర) ఎన్నికయ్యారు. 21 మందితో సెంట్రల్ కమిటీని ఎన్నుకోగా వారిలో 9 మందితో పొలిట్ బ్యూరోను ఎంపిక చేశారు. కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా తెలంగాణకు చెందిన రాయల చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రదీప్‌సింగ్ ఠాగూర్, పోటు రంగారావు, సుభాష్‌దేవ్ మాట్లాడుతూ.. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఫాసిస్ట్ బీజేపీని ఓడించడమే తమ పార్టీ లక్ష్యమని అన్నారు.

నేడు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల ఖరారు!

- ఢిల్లీ వెళ్లనున్న రేవంత్, భట్టి, ఉత్తమ్
- తొలి జాబితాలో రాష్ట్రం నుంచి 10 మందికి చాన్స్

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ గురువారం ఢిల్లీలో సమావేశం కానున్నది. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయనున్న పార్టీ అభ్యర్థులను ఖరారు చేయనున్నది. సమావేశానికి సీఎం, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యుడు, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా తొలి జాబితాలో వంద మంది ఎంపీ అభ్యర్థులను ప్రకటించనుండగా, తెలంగాణ నుంచి 10 మంది ఉంటారని పార్టీ వర్గాల సమాచారం. పది నియోజకవర్గాల విషయంలో పీసీసీ ఎన్నికల కమిటీలో ఏకాభిప్రాయం కుదరడంతో ఆ జాబితాను ఇప్పటికే కేంద్ర ఎన్నికల స్క్రీనింగ్ కమిటీకి అందజేసింది. హైదరాబాద్ నుంచి అలీ మస్కట్, సికింద్రాబాద్ నుంచి బొంతు రామ్మోహన్, చేవెళ్ల నుంచి సునీతా మహేందర్‌రెడ్డి, జహీరాబాద్ నుంచి సురేశ్‌షట్కర్, కరీంనగర్ నుంచి ప్రవీణ్‌రెడ్డి, నిజామాబాద్ నుంచి జీవన్‌రెడ్డి, మహబూబాబాద్ నుంచి బల్‌రామ్ నాయక్, మహబూబ్‌నగర్ నుంచి వంశీచందర్‌రెడ్డి, పెద్దపల్లి నుంచి గడ్డం వంశీ, వరంగల్ నుంచి దొమ్మాటి సాంబయ్య అభ్యర్థిత్వంపై ఏకాభిప్రాయం కుదిరినట్టు సమాచారం. ఇంకా అభ్యర్థులు ఖరారు కాని నియోజకవర్గాల్లో ఖమ్మం, నాగర్‌కర్నూల్, మల్కాజిగిరి, భువనగిరి, నల్లగొండ, ఆదిలాబాద్, మెదక్ ఉన్నాయని సమాచారం. ఖమ్మం నుంచి పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని పోటీ చేయాల్సిందిగా పీసీసీ కోరుతుండటంతో ఆయన నుంచి స్పందన కోసం వేచి చూడాలని భావిస్తున్నట్టు తెలిసింది. నాగర్‌కర్నూల్ నుంచి బీఆర్ఎస్-బీఎస్పీ పొత్తులో భాగంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోటీపై స్పష్టత వచ్చాకే అభ్యర్థిని ప్రకటించాలని నిర్ణయించినట్టు తెలిసింది.

వరంగల్ స్థానంపై సీపీఐ కన్ను

వరంగల్ (ఎస్సీ రిజర్వ్) నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావిస్తున్న సీపీఐ ఈ ప్రతిపాదనను కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లింది. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా, జాతీయ కౌన్సిల్ సభ్యుడు రామకృష్ణ పాండా ఇటీవల ఢిల్లీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి వరంగల్ స్థానం తమకు కేటాయించాలని కోరారు. ప్రస్తుతం భారత్ జోడో యాత్రలో ఉన్న రాహుల్‌గాంధీని సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని ఖర్గే బదులిచ్చారు. ఇప్పటికే సీనియర్ జర్నలిస్ట్ బీఆర్ లెనిన్ అభ్యర్థిత్వాన్ని సీపీఐ నాయకత్వం ఖరారు చేసింది.

అసమర్థులను ఇంటికి పంపండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారుల పనితీరును హైకోర్టు తీవ్రంగా ఎండగట్టింది. ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం వల్లే ప్రజలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేస్తున్నారని పేర్కొంటూ.. అసమర్థ అధికారులను ఇంటికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పీసీబీ షోకాజ్ నోటీసుకు వివరణ ఇచ్చినప్పటికీ తమ ఫిర్యాదును మూసివేయడాన్ని సవాలు చేస్తూ ప్రోస్టార్స్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఫిర్యాదు మూసివేత ఉత్తర్వులకు కారణమైన జేసీఈఈ కృపానందంపై వేటు వేయాలని, ఆయనకు నోటీసులు జారీ చేసి శాఖాపరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆయనను కొనసాగిస్తే కోర్టు ధిక్కరణగా పరిగణించి తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని హెచ్చరించింది.

ఆరోగ్య సేవలకు అంతరాయం

- ఐదు నెలలుగా రాష్ట్రానికి ఎన్‌హెచ్‌ఎం నిధులివ్వని కేంద్రం
- రూ.347 కోట్ల మేర బకాయిలు
- వెంటనే ఇవ్వాలని కేంద్రానికి మంత్రి దామోదర లేఖ

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): నేషనల్ హెల్త్ మిషన్ కింద రాష్ట్రానికి రావాల్సిన నిధులను విడుదల చేయడంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా రెండు త్రైమాసికాలకు సంబంధించిన నిధులను ఇంకా విడుదల చేయలేదు. ఫలితంగా ఎన్‌హెచ్‌ఎం కింద చేపట్టిన మాతాశిశు సంక్షేమ సేవలు, ఇమ్యునైజేషన్, కమ్యునికేబుల్ డిసీజెస్ కంట్రోల్ ప్రోగ్రామ్స్, ఆరోగ్య సేవా కేంద్రాల నిర్వహణలో తీవ్ర అంతరాయం కలుగుతున్నదని రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తంచేస్తున్నది. ఈ నేపథ్యంలో రూ.347 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా కేంద్ర ప్రభుత్వానికి తాజాగా లేఖ రాశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎన్‌హెచ్‌ఎం కింద రాష్ట్రానికి రూ.1,480 కోట్ల బడ్జెట్‌ను కేటాయించారు. దీనిలో కేంద్రం వాటా రూ.888 కోట్లు (60 శాతం) కాగా, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.592 కోట్లు (40 శాతం). కేంద్రం ప్రతి మూడు నెలకోసారి నాలుగు విడుతల్లో నిధులను విడుదల చేస్తుంది. మొదటి ఆరు నెలల నిధులే విడుదలయ్యాయని, మూడు, నాలుగో త్రైమాసికాల నిధులు ఇంకా విడుదల కాలేదని మంత్రి తన లేఖలో పేర్కొన్నారు. మూడో విడతకు సంబంధించి కేంద్రం విధించిన అన్ని నిబంధనలను పాటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తరపున నిరుడు నవంబర్ 6న ప్రతిపాదనలు పంపించామని గుర్తుచేశారు. నిధులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

17 వేల మందికి అందని వేతనాలు

వేతనాలు అందక ఎన్‌హెచ్‌ఎం కింద రాష్ట్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. ఎన్‌హెచ్‌ఎం కింద రాష్ట్రంలో సుమారు 17,000 మంది వరకు పనిచేస్తున్నారు. వీరిలో ఆశా కార్యకర్తలు, సెకండ్ ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఇతర విభాగాల సిబ్బంది ఉన్నారు. కేంద్రం ఎన్‌హెచ్‌ఎం నిధులు విడుదల చేయకపోవడం, రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో మూడు నెలలుగా వారి కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్ర నిధుల నుంచి వేతనాలు ఇచ్చి, తమ కుటుంబాలను పస్తుల నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

వద్దిరాజుకు ఎంపీ పార్థసారథిరెడ్డి శుభాకాంక్షలు

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): నూతనంగా రాజ్యసభకు మరోసారి ఎన్నికైన వద్దిరాజు రవిచంద్రను బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి సత్కరించారు. బుధవారం బంజారాహిల్స్‌లోని ఎ